క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే ఇద్దరికి ఆర్థిక సాయం

మంగళగిరి: నగర పరిధిలోని పలువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. నగర పరిధిలోని యర్రబాలెం జామియా మస్జీద్ సెంటర్‌కు చెందిన షేక్ నాగూల్ మీరా రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో రూ.10 వేలు, ఉడా కాలనీకి చెందిన షేక్ మౌలాలీ భార్య నగీనా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఇటీవల ఆపరేషన్ చేశారు. భర్త మౌలాలీ వికలాంగుడు కావడంతో కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేయగా పార్టీ నేతలు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, హస్నన్, సంకె సునీత చేతుల మీదుగా అందజేశారు.

క్యాన్సర్ బాధితురాలికి..

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ఆదివారం ప్రకటించారు. రూ.20 వేలు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మారెడ్డి రాజారామిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈదులమూడి శేఖర్, రామకృష్ణారెడ్డి(నాని), ఉయ్యూరు శివరామిరెడ్డి, సునీల్, నాగేశ్వరరావు, పఠాన్, షేర్‌ఖాన్, ప్రభుదాసు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి విఘ్నేశ్వర పూజ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శాంతిహోమం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం వంటి కార్యక్రమాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా ఉదయం 10 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి శాంతి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీస్థాయిలో భక్తులకు అన్నదాన చేశారు. సాయంత్రం గ్రామంలోని పురవీధులలో గ్రామోత్సవం అత్యంత వైభవంగా కోనసాగింది. వేడుకలలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో సర్వంగా సుందరంగా అలంకరించారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చారు. ఉదయాన్నే కడప, ఆళ్లగడ్డ, అనంతపురం, రాజోలు, వెంకటాయపాలెం ప్రాంతాలను రైల్లు, వాహనాల్లో భక్తులు వచ్చి కొండ ఎక్కారు. తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

తాడేపల్లి రూరల్: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ అన్నారు. ఆదివారం రాజకీయ ప్రచార భేరీ యాత్రను చిలువూరులో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ మతాల మధ్య చిచ్చు రాజేస్తోందని, అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచి పెడుతోందని మండిపడ్డారు. బ్యాంక్‌లు, ఎల్ఐసీ, రైల్వే, విశాఖ ఉక్కు తదితరాలను ధారాదత్తం చేస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలపై హత్యలు, మానభంగాలు పెరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వి.సాంబశివరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, సీపీఐ నాయకులు ఎస్ కరీముల్లా, బి.చిరంజీవి, ఎస్‌కే బాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహస్వామి మృతి

మంగళగిరి: నగరంలోని శాలివాహననగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అధ్యక్షుడు అన్నవరపు నరసింహస్వామి(72) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నరసింహస్వామి ఆదివారం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. భౌతిక కాయాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్‌లు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొన్నెకల్లులో చైన్ స్నాచింగ్

తాడికొండ: తెల్లవారుజామున గేదెల కొట్టం వద్దకు వెళుతున్న మహిళ మెడలో చైన్ లాక్కొని పరారైన ఘటన పొన్నెకల్లులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కోటా సామ్రాజ్యం(70) తెల్లవారుజామున 5 గంటలకు గేదెల కొట్టం వద్దకు నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు పొన్నెకల్లు సెంటర్‌కు దారి ఎటు వెళ్లాలని అడిగి అడ్రస్ తెలుసుకొన్న అనంతరం మహిళ మెడలో ఉన్న రెండు పేటల నానుతాడుని లాక్కొని పరారయ్యారు. దొంగిలించిన తాడు 40 గ్రాములు అని, విలువ రూ. 40 వేలు ఉంటుందని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

స్వచ్ఛంద సేవలు వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే ఆర్కే



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: స్వచ్ఛంద సంస్థల సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలో ఈమనిలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలతో కలసి ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 1998 నుంచి మంగళగిరి నియోజకవర్గంతో పాటు అనేక ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. శిబిరంలో డాక్టర్ వంశీ, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఆర్.రామకృష్ణ, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ వేణుగోపాల రెడ్డి, డాక్టర్ ప్రసాద్ సేవలందించారు. కార్యక్రమంలో అనంతరం మానవ సేవా సంస్థ అధ్యక్షులు వంగర సురేష్, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, ఈమని గ్రామ సర్పంచి శ్రీవాణి, సంస్థ సభ్యులు రమేష్, రవి, శ్రీనివాస్, సుధాకర్, శివమణి, వెంకట్రాది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



టిడ్కో నివాసాల వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి

మంగళగిరి: అగ్ని ప్రమాదాల నివారణపై ఆదివారం నగర పరిధిలోని ఆటోనగర్ టిడ్కో గృహ సముదాయం ఆవరణలో స్థానికులకు అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా అపార్టుమెంట్లలో పై అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

మంగళగిరి: వేసవి దాహార్తిని తీర్చాలనే సదుద్దేశంతో నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట ఆదివారం స్థానిక యువత ఆధ్వర్యంలో వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాటసారులకు, వాహనదారులకు 100 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల సాయి, భీమవరపు నాగరాజు, లేళ్ల నరసింహారావు, భీమవరపు వెంకట్రావు, కాపరౌతు సుందరయ్య పాల్గొన్నారు.

పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి
- నగరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



అంబటినగర్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



బాప్టిస్టుపేటలో 'జగనన్నే మా భవిష్యత్'లో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతోందని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. నియోజకవర్గంలోని 3వ సచివాలయ క్లస్టర్ పరిధిలోని యర్రబాలెంలోని శ్రీరామానగర్, అంబటినగర్ కాలనీల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు... మానమ్మకం నీవే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాలి జవాన్,. సయ్యద్ భాషా, షేక్ బడేమియా, షేక్ షఫీ, షేక్ సలీమ్, దారా దుర్గారావు పాల్గొన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఎండీ ఫిరోజ్, బొమ్ము సాంబిరెడ్డి, గాలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. నీరుకొండ దళిత శిబిరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురగంటి ఆదాం, కురగంటి రాజేష్, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగన్'

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఉన్న 25 సచివాలయాల పరిధిలో ఆదివారం వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగనన్న ఉత్సాహంగా జరిగింది. తాడేపల్లి పట్టణ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారధులు ఇంటింటికి తిరిగారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు(పండు), ఉండవల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ దంటు గోవర్ధన్‌రెడ్డి, ఎస్టీ సెల్ పట్టణ రూరల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, సంకురు మరియబాబు, బీసీ సెల్ నాయకులు బత్తుల దాసు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు సీఎం జగన్ పాలన కోరుకుంటున్నారు

మంగళగిరి: ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం నగర పరిధిలోని 15వ వార్డు బాప్టిస్టుపేటలో మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కలకోటి బోయేజు, నందిగం వసంతరావు, కందేటి జేమ్స్, శోభన్ బాబు, కలకోటి దేశయ్య పాల్గొన్నారు.

మురిసిన గోల్డెన్ జూబ్లీ స్నేహం..



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

పెదపులివర్రు(భట్టిప్రోలు): స్నేహ బంధం ఎంత మధురం.. కరిగిపోదు జీవితాంతం.. అన్న ఓ కవి భావన ఇలాంటి పూర్వ విద్యార్థుల ఆత్మీ సమ్మేళనాన్ని చూసినప్పుడు అక్షరసత్యమనిపిస్తుంది. పెదపులివర్రులోని గుత్తా సుబ్బరాయ చౌదరి జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా..ఆదివారం పాఠశాలలో 1972–1973 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఐదు దశాబ్దాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగారు. ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు. బాల్య జ్ఞాపకాలను, మధురానుభూతులను గుర్తు చేసుకుని మళ్లీ చిన్న పిల్లలయ్యారు. వివిధ హోదాల్లో స్థిరపడిన వారు.. సార్, మేడమ్ అన్న పలకరింపులకు విరామం ఇస్తూ.. ఏరా..ఏమె.. ఎలా ఉన్నావు, ఏం చేస్తున్నావు.. అన్న ఆత్మీయ పలకరింపులతో మునిగిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో గడిపి అక్కడి బరువెక్కిన హృదయాలతో తిగిరి వెళ్లారు. స్నేహితులందరినీ.. ఒకచోట కలిపేందుకు గుత్తా కట్టయ్య చౌదరి, గుత్తా రంగారావు(బోస్), సుంకర సంగమేశ్వరరావు, దేవినేని చలపతిరావు, జి.ప్రభు కుమార్ కృషి చేశారు. తమ బ్యాచ్‌లో 51 మంది విద్యార్థులకు గాను 33 మందికి పైగా కుటుంబ సమేతంగా హాజరయ్యారని వారు తెలిపారు. నాటి గురువులు ఎన్.భారతి దేవి (సైన్స్), బి.శక్తి కుమారి(సైన్స్), యు.రంగవర్ధిని (హిందీ పండిట్), కోగంటి చిదంబరరావు(ఎన్‌డీఎస్)ను ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల సుబ్బారావు మృతి

నివాళులర్పించిన ఎంపీ నందిగం సురేష్, కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: వైఎస్సార్ సీపీ తుళ్లూరు మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్ తండ్రి బత్తుల సుబ్బారావు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సందర్భంగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, పలువురు నాయకులు సుబ్బారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొన్న ఎంపీ నందిగం సురేష్, కార్యకర్తలతో కలసి పాడెమోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పాస్టర్‌పై కేసు నమోదు

మంగళగిరి: స్థలం విక్రయిస్తానని నగదు తీసుకుని ఓ మహిళను మోసం చేసిన పాస్టర్‌పై కేసు ఆదివారం నమోదైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. మేరకు నగర పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన షేక్ ముంతాజ్‌కు చెందిన స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన పాస్టర్ మృత్యుంజయుడు మధ్యవర్తిగా ఉండి వరలక్ష్మి అనే మహిళకు ఒప్పందం కుదిర్చాడు. వరలక్ష్మి వద్ద పాస్టర్ రూ.3లక్షలు డబ్బులు తీసుకుని ముంతాజ్‌కు రూ.1.90వేలు మాత్రమే ఇచ్చాడు.

మిగిలిన నగదు పాస్టర్ వాడుకోగా వరలక్ష్మి తనకు స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తీసుకు రాగా ఆమెపై దాడికి దిగాడు. దీనిపై వరలక్ష్మి పట్టణ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దర్శకుడు రేలంగి నరసింహారావుకు పురస్కారం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పాత గుంటూరు: కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్ రీడింగ్ రూం వేదికగా కేఆర్‌కే ఈవెంట్స్, కళావిపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ అల్లురామలింగయ్య శత జయంతి పురస్కరించుకొని తెలుగు నాటక రంగస్థల పురస్కారాల సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పాములపాటి శ్రీనివాసరావు జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా నటుడు పలమాని శ్రీనివాసరావు, ఎన్‌టీఆర్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ, ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, రంగస్థల నటుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, పౌరాణిక కళాకారుల అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు అల్లురామలింగయ్య ఆత్మీయ పురస్కారం, రంగస్థల నటుడు ముప్పా పెద బాపిరెడ్డికి రంగస్థల పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం హ్యూమర్ క్లబ్ హాస్య వల్లరి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, అధ్యక్ష, గౌరవాధ్యక్షులు బొప్పన నరసింహారావు, రామరాజు శ్రీనివాసరావు, జి.మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు, జీవీజీ శంకర్ పర్యవేక్షించారు.

దాడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్:వ్యక్తిపై దాడి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండకు చెందిన షేక్ అబ్దుల్లా గుంటూరులోని ఉల్ఫా హోల్ సెంటర్‌లో ఆటోలో కూర్చుని ఉండగా చంద్రకాంత్ అతడితో పాత కక్షల నేపథ్యంలో గొడవపడ్డాడు. అబ్దుల్లాని చంద్రకాంత్ కొట్టి గాయపరిచాడు. వైద్య చికిత్స అనంతరం ఆదివారం అబ్దుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్ 1వ లైనుకు చెందిన రాజేంద్రబాబు కుమార్తె కె.రమ్యకృష్ణ (30) శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లి పోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి



ప్రజారోగ్య వేదిక రాష్ట్ర సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మంగళగిరి: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి పాలక పార్టీలు కృషి చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్ అన్నారు. నగరంలోని గోపాలకృష్ణ థియేటర్ సమీపంలోని ఆస్పత్రిలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర సావనీర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం గురించి పాలక పార్టీలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్య రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక మంగళగిరి డివిజన్ నాయకులు డాక్టర్ వంశీ కృష్ణ, విజయ్, ఎం.నాగేశ్వరరావు, రాజేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, పి.బాలకృష్ణ, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ బోర్డు సమావేశం



నేషనల్ క్రిస్టియన్ బోర్డు రాష్ట్ర అధ్యక్షులు రెవ. డాక్టర్ నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మహానాడులోని హెమ్మెను ప్రార్థనా మందిరంలో నేషనల్ క్రిస్టియన్ బోర్డు సమావేశం ఆదివారం నిర్వహించారు. బోర్డు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బి.నవీన్ కుమార్ మాట్లాడుతూ దైవజనులందరు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం నవీన్ కుమార్‌ను రాష్ట్ర సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో నేషనల్ క్రిస్టియన్ బోర్డు అధ్యక్షులు డాక్టర్ జాన్‌మాస్క్, వైస్ ప్రెసిడెంట్ బి.అమృతరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్.పీటర్, గుంటూరు జిల్లా అధ్యక్షులు కేఎన్ బర్నబాస్ పాల్గొన్నారు.

పోతురాజు పోలేరమ్మ ఆలయంలో పూజలు



పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, సురేష్ కుమార్

దామరపల్లి(తాడికొండ): స్థానిక పోతురాజు పోలేరమ్మ ఆలయంలో నెల పొంగళ్ల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దంపతులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగనన్న కాలనీలో మంచినీటి పంపుకు శంకుస్థాపన

దామరపల్లిలోని జగనన్న కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయబోయే మంచినీటి బోరుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్ కుమార్ దంపతులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, నాయకులు తాళ్ల నాగరాజు యాదవ్, పలు గ్రామాల సర్పంచులు ముప్పాళ్ళ మనోహర్, బెజ్జం మహేష్ బాబు, మాదాసు రత్నకుమారి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరవరానివి



గాయకుడు సుధాకర్, ప్రవీణ్‌కుమార్, భావనా చౌదరిలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ సేవలు మరవరానివని బొప్పన ప్రవీణ్ కుమార్, గుమ్మడి భావన చౌదరిలు పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్ అసోసియేషన్ హాల్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. బహుజనుల కోసం ఎన్టీఆర్ తీసుకువచ్చిన సంస్కరణలపై వారు ప్రసంగించారు. అనంతరం ప్రముఖ గాయకుడు మామిడి వెంకట సుధాకర్‌తో పాటు వక్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, శ్రీకరరావు, ఉప్పు సత్యనారాయణ, పరుచూరి రమ్య, సత్యవతి, సుజాత, సరోజాలక్ష్మి, నాగమణి, గుమ్మడి వాణి, కంచర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కళలకు కణాచి హిందూ కాలేజీ హైస్కూలు



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న శివరామకృష్ణ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: బోధనతో పాటు ఎంతో మంది విద్యార్థుల్ని కవులు, కళాకారులుగా తీర్చిదిద్దిన హిందూ కాలేజీ హైస్కూలు కళలకు కాణాచి వంటిదని ఆ పాఠశాల కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విజ్ఞానం మేళవించి బోధన చేస్తే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని పాలకవర్గ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యను నేర్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూలు పూర్వ విద్యార్థి డాక్టర్ చంద్రశేఖర్, పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎల్.ఎస్. మూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ



ఆర్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌ను సత్కరిస్తున్న అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 7వ లైనులోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ మాట్లాడుతూ ప్రతినెలా 100 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కె. కిరణ్ కౌశిక్ మాట్లాడుతూ ప్రతి నెలా 30 మంది పేదలకు పెన్షన్ ఇవ్వడంతో పాటు రూ.రెండు లక్షల ఉపకార వేతనాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బోర్డు సభ్యుడు ముప్పల నరిసింహచెట్టి మాట్లాడుతూ అవోపా సామాజిక సేవల్ని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ కె. రామలింగేశ్వరరావు రోగుల్ని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, లింగమల్లు రమేష్, నిడమానూరి సురేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: నగరంలోని కొత్తపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తపేటకు చెందిన కాలేషావలి తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. కొద్ది సేపటి అనంతరం బయటకు రాగా తాను పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైంది, దీంతో చోరీకి గురైందని భావించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపాలి: సీపీఎం

పెదకాకాని: ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో ఆదివారం ప్రచార భేరి కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ మన రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంత కాదని తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరానికి నిధుల మంజూరు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ.. ఇవన్నీ పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలేనని పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి ఆయువుపట్టు లాంటి విశాఖ ఉక్కు జిందాల్ ఆదానీకి కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని అడ్డుకోవడంలో ప్రాంతీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. రైల్వే, టెలికాం బ్యాంకులు, ఓడరేవులు, గనులు ప్రైవేటు వాళ్లకి దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బురదగుంట సాంబయ్య, కె. రాఘవయ్య, ఎ. నాగేశ్వరరావు, శామ్యేల్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.